క్లుప్తంగా

జాబ్‌మేళా విజయవంతం



నిర్వహిస్తున్న జాబ్‌మేళా

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఈ జాబ్‌మేళాలో 150 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఎంపికై న వారికి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కోట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



జగన్నాథపురం యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలోని యూపీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జగన్నాథపురం యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాథపురం, బెలగాంలో రెండు యూపీహెచ్‌సీలు ఉన్నాయి. మందులు ఉన్నాయి. స్టాఫ్ ఉన్నారు, రోగులు ఉన్నారు, డాక్టర్స్ లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డాక్టర్‌లు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే డాక్టర్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదవ రోజు 95 మందికి ఈసెట్ కౌన్సెలింగ్



ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఐదవ రోజు 95 మందికి ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విలియం క్యారీ తెలిపారు. ఈ మేరకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల 10వరకు పరిశీలించనున్నామని చెప్పారు. తొలి, రెండు, మూడు, నాలుగు రోజుల్లో 605 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేలకూలిన చెట్టు



గాలికి కూలిన చింత చెట్టు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలితో కూడిన వర్షానికి బూర్జ ఉన్నత పాఠశాల సమీపంలో చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో నిరంతరం రాకపోకలు సాగించే బొబ్బిలి వయా సీతానగరం–అజ్జాడ బీటీరోడ్డులో చింత చెట్టుకూలిపోయి లెవెన్ కేవీ విద్యుత్ సరఫరా ఉన్న వైర్లు తగిలి తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బీటీరోడ్డులో బూర్జ వద్ద రోడ్డుపై చెట్టు కూలడంతో అజ్జాడ వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సును బూర్జనుంచి మళ్లించారు. చెట్ల కొమ్మలు తొలగించి ద్విచక్రవాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏఈ జగన్మోహనరావు అప్రమత్తమై విద్యుత్ సిబ్బందితో వైర్లు సరి చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

గుండిచ గుడికి చేరిన జగన్నాథుడు



పూజలు అందుకుంటున్న ఉత్సవమూర్తులు

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్ర ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గుండిచ మందిరానికి తరలించారు. రథాన్ని లాగేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. గుండిచ మందిరంలో విగ్రహాలను ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో ప్రధాన మందిరంతో పాటు ఉప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పూరీ తరువాత అంతటి ప్రాసస్త్యం ఉన్న ఇక్కడి జగన్నాథస్వామి ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు తరలి వస్తున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టలేకపోయింది.



సీతానగరం: మండలకేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



సాలూరు రూరల్: వైఎస్‌ఆర్ విగ్రహం ముందు కేక్ చేస్తున్న సర్పంచ్ సువ్వాడ శశికళ



బలిజిపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానేతకు మనస్సుమాంజలి

- వాడవాడలా దివంగత వైఎస్సార్ జయంతి వేడక
- ఘనంగా నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు

సీతానగరం:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నియోజక వర్గం వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నేతృత్వంలో సీతానగరం మండలంలోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

డాక్టర్ వైఎస్సార్ జయంతి ఉత్సవాలలో భాగంగా పెదంకలాంలో ఎంపీపీ బి.రమణమ్మ, శ్రీరాములునాయుడు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం కేక్‌కట్ చేసి పలువురికీ స్వీట్స్ పంపిణీ చేశారు. జానుమల్లువలసలో వై.వెంకటనాయుడు, యాళ్ల అప్పలనాయుడు, పారినాయుడు, శివున్నాయుడు,ఆర్ వెంకంపేటలో సర్పంచ్ పి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ పి.సత్యనారాయణ, మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ జయమణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పార్థసారథి, ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరి, ఎస్.వెంకటరమణ, వై శివున్నాయుడు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి పండ్లు పంపిణీ చేశారు. కేక్‌లు కట్‌సి అందరితో తినిపించారు.



లచ్చయ్యపేటలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, సర్పంచ్ కృష్ణ



సీతానగరం: పెదంకలాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బి.రమణమ్మ



జానుమల్లువలసలో రాజన్న విగ్రహానికి పూలమాలలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మక్కువలో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న మావుడి రంగునాయుడు



బలిజిపేట: అరసాడలో నివాళులర్పించిన నాయకులు

వైఎస్సార్ విగ్రహావిష్కరణ

బలిజిపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయసాధనకు అందరం పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పణుకువలసలో నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజలకు ఎన్నో సేవలు అందించారని అటువంటి నాయకుడి ఆశయ బాటలో ప్రయాణించాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో లేకపోయినా అందరం కలిసికట్టుగా ప్రజల పక్షాన ఉండాలని పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి తన పాలనలో పేదల పక్షాన నిలబడి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి వారి జీవనస్థితిగతులను మెరుగుపరచడంలో ఎంతగానో కృషిచేశారన్నారు. పార్టీ కార్యకర్తలకు, పార్టీ బలోపేతానికి, ప్రజలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జోగారావు హామీ ఇచ్చారు. తనను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ లత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పి.సత్యనారాయణ, సర్పంచ్‌లు కె.మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సుందరరావు, ఎంపీటీసీలు జి.శారద, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పణుకువలసలో విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే జోగారావు

వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్:

అతిసారం, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, డెంగీ, అతిసార వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యల్లో భాగంగా పురపాలక సంఘం కార్యాలయంలో జూన్ 1నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో పబ్లిక్ గ్రీవెన్సులు, కుళాయి లీకేజీలు, శానిటేషన్ పనులు, సీజనల్ వ్యాధులపై సమస్యలు తీసుకుంటామని చెప్పారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 8008237549కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చని, ఈ సేవలను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

10న వాహనాల వేలం

వీరఘట్టం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఐదు వాహనాలను ఈనెల 10న వీరఘట్టం పోలీస్ స్టేషన్ ఆవరణలో బహింగ వేలం వేయనున్నట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు. వేలం వేయనున్న వాహనాల్లో ఒక ఆటో, రెండు స్కూటీలు, ఒక బైక్, ఒక మోపెడ్ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని ఎస్సై కోరారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

సీతంపేట: మలేరియాతో బాధపడుతూ వెన్నలవలస ఆశ్రమ పాఠశాలలో మృతిచెందిన బిడ్డిక రస్మిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అచ్చెబ గ్రామంలో మృతురాలి కుటుంబాన్ని గిరిజన సంఘ నాయకులు బి.అప్పారావు, ఎం.తిరుపతిరావు, భాస్కరరావు, దుర్గారావు, తదితరులు సోమవారం పరామర్శించారు. ఈ సంవత్సరమే వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలలో చేరిందని, జ్వరం వచ్చి మూడు రోజులైందని, సరైన ట్రీట్మెంట్ అందక మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ పరిస్థితికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

జీగిరాం జూట్‌మిల్లు తెరిచేదెప్పుడో?



జీగిరాం జూట్ మిల్లు

- మంత్రి సంధ్యారాణి చర్యలు తీసుకుంటారా?
- యాజమాన్యం టీడీపీ సానుభూతిపరులు కావడంతో..
- గంపెడాశతో కార్మికుల ఎదురుచూపులు

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం జూట్ మిల్లు 1986లో ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు కొన్ని వేలమంది కార్మికుల కుటుంబాలను ఆదుకుని సాలూరు ప్రాంతంలో లారీ పరిశ్రమ తరువాత స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల కార్మికులకు ఉపాధి కల్పించిన ఘనతను దక్కించుకుంది. అయితే రెండేళ్ల క్రితం మూతపడిన జీగిరాం జూట్ మిల్లును తెరిపించేందుకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఎన్నో విధాలా కృషిచేశారు. మిల్లు విద్యుత్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ పరంగా ఆయన సహకరించినప్పటికీ యాజమాన్యం లాకౌట్ ఎత్తివేయడానికి సహకరించలేదు. దీంతో అప్పటినుంచి తనవంతుగా రాజన్నదొర ప్రయత్నం చేస్తూ వచ్చారు. అయితే ప్రభుత్వ మారడంతో తనవంతుగా కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎన్నికల సమయంలో పదేపదే జీగిరాం జూట్‌మిల్లు తెలిపించే బాధ్యత తీసుకుంటానని తాను గెలిచిన వెంటనే కార్మికులకు అండగా ఉంటానని మాట ఇచ్చారు. అయితే ఆమె ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు క్యాబినెట్‌లో చోటు దక్కడంతో ఆమె ఇచ్చిన మాట నిలబెట్టుకునే అవకాశం వచ్చిందని స్థానిక జూట్ కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అంతే కాక జూట్‌మిల్లు యాజమాన్యం కూడా టీడీపీ సానుభూతి పరులే కావడంతో మిల్లు తెరిచేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని నమ్ముతున్నారు. ఇదిలా ఉండగా సాలూరు ఎన్నికల ప్రచారానికి వచ్చిన నారా లోకేష్‌కు కూడా అప్పట్లో కార్మికులు వినతిపత్రం ఇవ్వగా ఆయన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే జూట్‌మిల్లు తెరిపించే బాధ్యత తీసుకుంటానని మాట ఇచ్చినట్లు కార్మికులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం సాలూరు ప్రాంతంలో కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఉన్న ఒకే ఒక్క జూట్ మిల్లు ఎప్పుడు తెరుచుకుంటుందోనని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

కోర్టు ఖర్చులు రాజన్నదొర ఇస్తామన్నారు

జూట్ మిల్లు యామాన్యంపై కార్మికులు కోర్టుకు వెళ్తే అందుకు అవసరమైన ఖర్చులు తాను భరిస్తానని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాటిచ్చారు. అయితే కార్మికులం ఈ విషయంలో వెనుకడుగు వేశాం. రాజన్నదొర చేసిన కృషి ఫలించలేదు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయంలో సహకరిస్తుందని ఆశపడుతున్నాం.

– సూర అప్పలనాయుడు, జూట్ కార్మికుడు

రైతులకు ఎరువుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర

సీతానగరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించనున్న పంటలకు అవసరమైన ఎరువులు సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చినభోగిలి ఆర్బీకేలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశల వారీగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారులు రైతులకు మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.రాధ, ఎంపీటీసీ గురాల బుజ్జి, మండలస్థాయి అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని ఎమ్మెల్యే విజయచంద్ర అధికారులకు సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. సరైన సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, అందజేయనున్నామని, సాగునీటికి ఇబ్బంది లేకుండా పెదంకలాం కాలువ ద్వారా నీరు అందే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిలో ప్రగతి ఉండాలి

బలిజిపేట: మంచి విద్యాబోధనతో ప్రతి విద్యార్థిలో ప్రగతి తీసుకురావాలని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వెంగాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో బోర్డుపై రాసి ఉన్న పదాన్ని విద్యార్థులతో చదివించి తగు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఒకటవ ర్యాంకులో ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు మంచి విద్యను అందిస్తేనే ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేసిన వారమవుతామన్నారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూస్ అందేవిధంగా చూడాలని కోరారు. మంచి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెంగాపురం ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించిన ఎంఈఓ సామల

ఆడిట్ అభ్యంతరాలపై రివ్యూ



రివ్యూ చేస్తున్న డీపీఎం ఫైనాన్స్ అప్పారావు

బలిజిపేట: ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో కనిపించిన అభ్యంతరాలను సరిచేసుకోవాలని డీపీఎం ఫైనాన్స్ అప్పారావు సూచించారు. ఈ మేరకు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏల తో ఆయన సోమవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యంతరాలకు సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని వారం రోజుల్లో సరిచేసుకోవాలని హితవు పలికారు. వసూళ్లు ఆయా హెడ్‌లకు సంబంధించి ఉంచాలని సూచించారు. వీఓఏల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లీగల్ కోఆర్డినేటర్ రాజారావు లోకో యాప్‌పై ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చారు. మొబైల్ బుకింగ్ స్థానంలో దీనిని వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనలో ఎస్‌హెచ్‌జీలు కీలకం

పార్వతీపురంటౌన్: బాల్య వివాహాల నిర్మూలనలో స్వయం సహాయక సంఘాల సభ్యులు కీలకమని బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ ప్రశంసించారు. ఈ మేరకు సోమవారం ఆయన వెలుగు కార్యాయంలో జిల్లాలోని 15 మండల మహిళా సమాఖ్యలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాల లోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. ఎవరూ బాల్యవివాహాలను ప్రోత్సహించినా లేదా పెళ్లి చేసినా లక్ష రూపాయల జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుదని హెచ్చరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగినట్లయితే ఆ గ్రామంలో మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్)కి లేదా పిల్ల సహాయవాణి టోల్ ఫ్రీ నంబర్ 1098కు తెలియజేయాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ పువ్వల సురేష్, పార్వతీపురం మండల సమాఖ్య అధ్యక్షురాలు జగదీశ్వరి, బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ జి.తవిటి నాయుడు 60 మంది మండల స్వయం సహాయక సంఘ సభ్యులు, అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

సీతంపేట:

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలంటూ భాషా వలంటీర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరకు వినతిపత్రం అందజేశారు. మిగతా జిల్లాల్లో భాషా వలంటీర్లను రెన్యువల్ చేయడంతో వారంతా పాఠశాలలకు వెళ్తున్నారని, సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న వారిని ఇంతవరకు రెన్యువల్ చేయకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే రెన్యువల్ చేయాలని సంఘ నాయకుడు డొంబు, తదితరులు కోరారు.

పబ్లిక్ గ్రీవెన్స్ వెలవెల

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. సమస్యలపై వినతులు సమర్పించేందుకు కొద్ది మంది మాత్రమే వచ్చారు. ఉదయం 10.30 గంటలకు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్వీ గణేష్, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలంతో పాటు పలువురు అధికారులు వినతులు స్వీకరించడానికి వచ్చి కూర్చున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులు ఇచ్చేందుకు ఎవరూ రాలేదు. ఆ తరువాత కొద్ది మంది సమస్యలపై వినతులిచ్చారు.



డీడీకి వినతిపత్రం అందిస్తున్న భాషా వలంటీర్లు